
# పాము కాటుకు నాటు వైద్యమా? నేటి వైద్యమా?

(అనుభవాలు - గుణపాఠాలు)



డా॥ దాసరి రామకృష్ణ ప్రసాదు

కింగ్ కోబ్రా పాముతో రొములస్ విటేకర్





# పాముకాటుకు నాటువైద్యమా?
# నేటి వైద్యమా?
## (అనుభవాలు - గుణపాఠాలు)

డాక్టర్ దాసరి రామకృష్ణ ప్రసాదు

**జనవిజ్ఞాన వేదిక**
(Member AIPSN & NCSTC Network)
చల్లపల్లి

# పాముకాటుకు నాటువైద్యమా? నేటి వైద్యమా?
## (అనుభవాలు - గుణపాఠాలు)

రచన :

**డా॥ దాసరి రామకృష్ణ ప్రసాదు,** చల్లపల్లి

మొదటి ముద్రణ : 01-01-2006
రెండవ ముద్రణ : ఫిబ్రవరి 2007
మూడవ ముద్రణ : జులై 2009
నాల్గవ ముద్రణ : నవంబరు 2010
ఐదవ ముద్రణ : నవంబరు 2014
ఆరవ ముద్రణ : డిసెంబరు 2017

ప్రతులు : 1,400

పుస్తకాలు దొరుకుచోటు :

**1. జి. మాల్యాద్రి,**

జి. మాల్యాద్రి
విజ్ఞాన ప్రచురణలు, (ప్రజాసైన్స్ వేదిక)
ప్లాట్ నెంబర్ 162, విజయలక్ష్మి నగర్, నెల్లూరు - 524 004.
మొబైల్ నెంబర్ - 9440503061

**2. డా॥ దాసరి రామకృష్ణ ప్రసాదు,** M.B.B.S., D.G.O.

పద్మావతి ఆసుపత్రి
చల్లపల్లి-521 126, కృష్ణా జిల్లా
ఫోన్ : (08671) 222350, 222443

బొమ్మలు : **వై.వి. కృష్ణ**

రూపకల్పన, ముద్రణ
**BLOSSOMS DESIGNERS & PRINTERS**
Vijayawada-520 002. Tel : 94900 99986

**వెల : రూ॥ 35/-**

# మా విన్నపం

మన వలెనే పాములు కూడా యీ ప్రకృతిలో ఒక భాగం. పౌరాణికుల కల్పనలలో మాత్రం అవి నాగదేవతలు! సామాన్యుల హృదయాలలో క్షణాల మీద భయభక్తుల్ని రేకెత్తించే యీ ప్రాణులు జీవ శాస్త్రవేత్తల వాస్తవిక పరిశీలనలో పర్యావరణ పరిరక్షకాలు! ఈ ప్రకృతిలోని ఆహారపు గొలుసులో తప్పనిసరి లింకులు.

బస్తీలలో కన్నా, పల్లెల్లో పాముకాటు గురించీ, దాని వైద్యం గురించీ చర్చోపచర్చలు సర్వసాధారణాలు.

పాముకాటు వైద్యంలో దేశవ్యాప్తంగా ఒక నిర్దిష్ట విధానం లేక ఎవరి అనుభవంతో వారు వైద్యం చేసేవారు. భారత ప్రభుత్వం 2009లో W.H.O. తో కలిసి కొన్ని మార్గదర్శకాలను నిర్దేశించింది. ఈ విషయంలో రెండున్నర దశాబ్దాల పాటు వేయికి పైగా కేసుల్ని నిర్వహించిన అనుభవంతో ప్రజలలోను, వైద్య ప్రపంచంలోను ఒక స్పష్టమైన సక్రమ అవగాహన కల్గించే ఉడతా ప్రయత్నమే యీ చిరు పుస్తకం. అనేక జిల్లాల నుండి ఈ పుస్తక ప్రతుల కోసం అభ్యర్ధనలు, దీని మీద జిజ్ఞాసువుల అభిప్రాయ ప్రకటనలు, విలువైన సూచనలే ఈ 6వ ప్రచురణకు ప్రేరణలు.

ఈ చిన్న పుస్తకం వెలువడిన 11 ఏళ్ళుగా వివిధ ప్రాంతాల్లో ఈ రచయిత పలు సమావేశాలలో వైద్యులతో, అధికారులతో, సామాజిక ఆరోగ్య కార్యకర్తలతో, పెద్దలతో, పిన్నలతో తన అనుభవాలను, కార్యాచరణపై తన ఆలోచనలను పంచుకొన్నారు. ప్రొఫెసర్ వి.వి. పిళ్ళై గారి వైద్య విద్యార్థుల పాఠ్యగ్రంథం "టెక్స్ట్ బుక్ ఆఫ్ ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజీ" లోను, అయనదే మరొక వైద్య గ్రంథంలోనూ ఇందులోని సంగతులు కొన్ని ప్రస్తావించబడటం హర్షణీయం.

2010లో హైదరాబాదు ఆకాశవాణి కేంద్రం నుండి ప్రసారమైన వ్యవసాయ కార్యక్రమంలో రెండుసార్లు పాముకాటు వైద్యం గురించి ఈ రచయిత చర్చలు, ఈటీవి 'సుఖీభవ' కార్యక్రమంలో రచయితతో ముఖాముఖి, ఈనాడు దినపత్రిక 'సుఖీభవ' పేజీలో ప్రచురితమైన 'పాముకాటు వైద్యంలో అనుభవాలు - గుణపాఠాలు' అనే వ్యాసం ప్రయోజనకరంగా ఉన్నవి.

జనవిజ్ఞాన వేదిక నిరంతర కృషి ఫలితంగా చల్లపల్లి ప్రాంతంలో 15-20 ఏళ్ళలో నాటు - మంత్ర - పసరు వైద్యాలకు బదులు శాస్త్రీయ వైద్యం పొందేవారు సున్నా నుండి 95 శాతం వరకు చేరడం మంచి పరిణామం.

భవదీయ

**జన విజ్ఞాన వేదిక, చల్లపల్లి.**

# కృతజ్ఞతలు

నా ఆలోచనలు యీ పుస్తక రూపం దాల్చడానికి ప్రేరణ
మిత్రులు శ్రీ వి.వి. సుబ్బారావు (జర్నలిస్టు, ఈనాడు),
రిటైర్డ్ అగ్రికల్చరల్ ఆఫీసర్ స్వర్గీయ శ్రీ మాలెంపాటి చంద్రశేఖరరావు గార్లది.
అడుగడుగునా ప్రోత్సహించి, సహకరించింది మా జనవిజ్ఞాన వేదిక కమిటీ
సభ్యులు. కొన్ని సందేహాల నివృత్తి కోసం చర్చించిన మిత్రులు
జువాలజీ లెక్చరర్ డా॥ నూతలపాటి శ్రీనివాస్‌గారు.
ఈ పుస్తకాన్ని ఆమూలాగ్రంగా ఎన్నోమార్లు నిశితంగా పరిశీలించి, అవసరమైన
చోట్ల చిరు మార్పులతో భాషా ప్రామాణికతను సమకూర్చిన మిత్రులు
శ్రీ నల్లూరి రామారావు (రిటైర్డ్ ప్రిన్సిపాల్)
మలి నాలుగు ముద్రణలకు ముఖ్యకారకుడై, ప్రజాహిత దృష్టితో వివిధ
జిల్లాలలో ఈ పుస్తక విస్తృత ప్రచారానికి కృషి చేస్తున్న
శ్రీ జి.మాల్యాద్రిగారు (ప్రజాసైన్స్ వేదిక).
ఈ గ్రంథాన్ని ఇంత అందంగా, పఠనయోగ్యంగా అచ్చు వేసిన మిత్రుడు
వెలగా శ్రీనివాస్ (జనవిజ్ఞాన వేదిక నాయకులు) మరియు వారి సిబ్బంది.
రెండు దశాబ్దాలుగా కొన్ని వేలమంది పాము కాటు రోగులకు
వైద్యం అందించడంలో సహకరిస్తున్న నా జీవన సహచరి డా॥ టి. పద్మావతి,
మా ఆసుపత్రిలో ఇతర సిబ్బంది అందరికీ.....

**ఈ సచిత్ర వ్యాసం మీద చదువరుల అమూల్య అభిప్రాయాలను,**
**సూచనలను తెలియజేస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుంది.**


చిరునామా

**డాక్టర్ దాసరి రామకృష్ణ ప్రసాదు**
**పద్మావతి ఆసుపత్రి**
చల్లపల్లి-521 126. కృష్ణా జిల్లా.
ఫోన్ : 222350, 222443 (08671)
e-mail : drk.drk@rediffmail.com

# పాము కాటుకు నాటు వైద్యమా?
# నేటి వైద్యమా?

నేను గుంటూర్లో ఎం.బి.బి.ఎస్. చదివే (1974-80) రోజుల్లో కృష్ణాజిల్లా - పెదమద్దాలిలో మా తాతగారి దగ్గర పనిచేసే పైడియ్యని త్రాచుపాము కరచింది. వెంటనే అక్కడికి దగ్గరలో ఉన్న పామర్రు పట్టణంలోని పాము కాటు వైద్యుడి దగ్గరకు తీసుకు వెళ్ళారు. అతడు ఏదో మందు వేసి నీకేమీ ఫర్వాలేదని ధైర్యం చెప్పాడు! కాని ఒక గంట అయినా గడవకుండానే పైడియ్య పరిస్థితి విషమించగా, "ఎం.బి.బి.ఎస్. డాక్టరు దగ్గరకు తీసుకు వెళ్లండి" అని చెప్పి ఆ నాటు వైద్యుడు చేతులు దులిపేసుకున్నాడు. డాక్టరు దగ్గరకు వెళ్ళిన కొద్దిసేపటికే పైడియ్య మరణించాడు. అప్పటికీ ఇప్పటికీ మా కుటుంబానికి అదొక బాధాకరమైన జ్ఞాపకం.


నేను చల్లపల్లిలో ఆసుపత్రి పెట్టిన మొదటి రోజు నుండి యాంటి స్నేక్ వీనమ్ మూడు దోసులు అట్టి పెట్టుకున్నాను. అప్పట్లో ఈ మందు మార్కెట్లో అంతగా దొరికేది కాదు. బ్లాక్ మార్కెట్లో కొనవలసిన పరిస్థితి! విషపు పాము కరిచిన మనిషికి ఆ మూడు దోసులు ఏ మూలకీ చాలదని గ్రహించటానికి చాలా కాలం పట్టింది. ఆ రోజుల్లో పాముకాటు కేసులు నాటువైద్యుల దగ్గరకు, మంత్రగాళ్ళ దగ్గరకు తప్ప ఎం.బి.బి.ఎస్. డాక్టర్ల దగ్గరకు వచ్చేవే కావు. పాము కరిచిన ఒక మహిళ తొలి కేసుగా నా దగ్గరకు వచ్చినపుడు ఎందరో సీనియర్ డాక్టర్లకు, నా డాక్టరు మిత్రులకు ఫోన్ చేసి, "రోగిలో ఏ లక్షణాలు మొదలైనపుడు యాంటి స్నేక్ వీనమ్ చేయాలి? ఎన్ని దోసులు ఇవ్వాలి? ఎంత సమయం పరిశీలిస్తూ వుండాలి? ఎప్పుడు రోగిని డిశ్చార్జి చేయవచ్చు?..." ఇలాంటి ఒక వంద ప్రశ్నలడిగాను. నేను హౌస్‌సర్జన్ చేసిన గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో గాని, రెండు సంవత్సరాలు పనిచేసిన ఒంగోలు ఆసుపత్రిలోగాని పాముకాటు కేసు ఒక్కటైనా రాలేదు. పాము విషానికి యాంటి స్నేక్ వీనమ్ ఇవ్వాలని తెలుసు గాని వాస్తవంగా రంగంలోకి దిగినపుడు పై సందేహాలకు సమాధానాలే దొరక లేదు.

అసలు పాము కాటుకు వైద్యం అంటే నోట్లో పసరు, కంట్లో కలికం లేక చెవిలో మంత్రం మాత్రమేనని ఎక్కువ మంది విశ్వాసం! ప్రతి మూడు నాలుగు ఊళ్ళకు ఒక నాటు వైద్యుడో, మంత్రగాడో వుంటాడు. రోగి కళ్ళల్లో కలికం వేసి, నోట్లో పసరు పోసి, వేరు నమిలించే వైద్యాలు చేస్తుంటాడు.

ఎక్కడో సుదూరంగా వున్న హనుమాన్ జంక్షన్‌లోని పెద్ద మంత్రగాడు ఫోను ద్వారా మంత్రం వేస్తే ఏ పాము కరిచిన వాడైనా బ్రతుకుతాడని చల్లపల్లి పరిసర జనాల ప్రగాఢ విశ్వాసం. పాము కరిచినపుడు జంక్షన్ మంత్రగాడికి ఫోన్ చేయవలసి వస్తే ఎస్.టి.డి. సౌకర్యం లేని ఆ రోజుల్లో టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వాళ్ళు మానవతా దృక్పథంతో లైటనింగ్ కాల్ ఇచ్చేవారు! కొంతమంది బ్రతికి బట్టకట్టేవారు. మరి కొంత మంది చనిపోయేవారు. మంత్రం అద్భుతంగా పనిచేసి రోగులు బ్రతికారని ప్రజలలో ప్రచారం జరిగేది. మృతిచెందినవారి విషయంలో వాళ్ళకు కాలం తీరిందని, విధిరాతనీ, లేక మరొక కారణమనీ జనం సానుభూతి పూర్వకంగా సర్ది చెప్పుకొనేవారు.


## అనివార్య మరణమా?

ఒక సాయంత్రం ఓ.పి.లో ఉండగా ఒక ప్రముఖ వ్యక్తి నా దగ్గరకు హడావిడిగా వచ్చి "డాక్టర్ గారూ! మా ఊళ్ళో ఫలానా వ్యక్తిని పాము కరిచింది. దయచేసి, ఉన్నఫళాన నాతో బయల్దేరి రండి..." అని కంగారు పెట్టారు. ఒక్క నిమిషం పాటు నేనాయన కంగారును తగ్గించి "రోగికి ఏ.ఎస్.వి. (యాంటీ స్నేక్ వీనమ్) ఆస్పత్రిలో మాత్రమే యివ్వాలని, తక్షణమే రోగిని ఆసుపత్రికే తీసుకురమ్మనీ, అప్పటికి నేను సర్వసన్నద్ధంగా ఉంటాననీ" చెప్పి పంపాను. సుమారు గంట తర్వాత లారీలో తీసుకు వచ్చారు- పాము కరిచిన వ్యక్తిని కాదు, అతని మృతదేహాన్ని! ఓపికగా విచారిస్తే తేలిందేమంటే - అతణ్ణి పొలంలో పాము కరిచి 2 1/2 నుండి 3 గంటలు గడిచింది. పొరుగూరి నాటు వైద్యుని దగ్గర పసరు వైద్యం చేయించి, పరిస్థితి విషమించాకే నన్ను సంప్రదించారు. దశాబ్దాల తరబడి ప్రపంచమంతా అమలు జరుగుతున్న, సమీపంలోనే ఉన్న అసలైన శాస్త్రీయ వైద్యాన్ని చేరుకోకముందే ఒక నిండు ప్రాణానికి పుణ్యకాలం ముగిసి పోయింది.



చావుకీ, బ్రతుక్కీ సంధి కాలమైన ఆ అరగంట ముందే ఏ.ఎస్.వి. ఇంజక్షన్ యివ్వలేకపోతినే అనే వేదన మాత్రం మిగిలింది. **నిస్సందేహంగా యిది నివార్యమరణమే. (Preventable Death)**

1989లో ఈ దుస్సంఘటన జరిగిన తక్షణం జనవిజ్ఞాన వేదిక చల్లపల్లి శాఖ సమావేశమై, ఇక ముందిలాంటి మరణాల కోసం



నివారణ "పాము కాటు నుండి రక్షించేది ఎ.ఎస్.వి. మాత్రమేనని, అశాస్త్రీయ, మంత్ర తంత్రాల, ఆకు పసరుల వైద్యం కానే కాదనే" వాస్తవాన్ని ప్రచారం చేయాలని నిర్ణయించింది. 7000 కరపత్రాలు ప్రచురించి చల్లపల్లి, పరిసర ప్రాంతాలలో పంచిపెట్టాం. ఏ గ్రామంలోని ఏ వేడుకలకు, సమావేశాలకు వెళ్ళినా గ్రామ పెద్దలకు పదేపదే యీ విషయాన్ని చెప్పిచూశాం. ప్రతి గ్రామ పంచాయితీ కనీసం 2 ఏ.ఎస్.వి. ఇంజక్షన్లు నిలువ చేసుకొని, విష సర్పం కరచిన వ్యక్తికా రెండు డోసులూ యిచ్చి, ఆ వెంటనే సమీపంలో ఏ డాక్టర్ దగ్గరకైనా రోగిని తీసుకు పొమ్మని విన్నవించాం. ఐతే, దురదృష్టవశాత్తూ మా ప్రచారాలేవీ ప్రజలమీద చేయవలసినంతగా పనిచేయలేదు.

ఒక స్కూల్ వార్షికోత్సవ సభలో ఇదే విషయాన్ని సవివరంగా చెప్పి, వేదిక దిగానో లేదో - ఒకాయన నా చేయి పట్టుకొని ఆపి రెండో చేత్తో తనజుట్టు పట్టి చూపిస్తూ "పిచ్చి డాక్టరు గారూ! నా జీవితంలో ఇదిగో యింత మందికి నాటు వైద్యం చేశాను. ఒక్కడైనా చనిపోలేదు. వేలకొద్దీ డబ్బు ఖర్చయ్యే ఇంజక్షన్ల ఇంగ్లీషు వైద్యం వేస్టు. నాటు వైద్యమే బెస్టు..." అని ఎగతాళిగా నవ్వాడు. నేనూ నవ్వాను.... నిస్సహాయంగా! అతను ఆవూరి నాటు వైద్యుడు.

అన్ని వ్యయప్రయాసలతో అంతకాలం మేము చేసిన ప్రచారం ఏమై పోయినట్టు? మరి జనం మీద ఆ ప్రచార ప్రభావమే ఉంటే ఆసుపత్రులకు

పాముకాటు కేసులు రావాలిగదా? నిరాశచెంది, మా ప్రచారాన్ని నిలిపేశాం.

## ఆయాచిత వరం... రోటరీ పథకం...

ఇది జరిగిన కొన్నేళ్ళకు కె.సి.పి. షుగర్ ఫ్యాక్టరీ మెడికల్ ఆఫీసరైన డాక్టర్ నారాయణరావు గారు మాకు ఫోన్ చేసి "పాము కాటు, కుక్క కాటులకు మందుల్ని రోటరీ క్లబ్ తరపున ఒక సంవత్సరం పాటు ఉచితంగా యివ్వదలచు కొన్నాం. కుక్క కాటు మందును మా కె.సి.పి. క్లినిక్‌లో యిస్తాం. పాము కాటు కేసులన్నీ మీరు చూడండి. ఏ.ఎస్.వి. వైల్స్ ఉచితంగా యిస్తాం" అని చెప్పారు.

పాముకాటు రోగులు అర్హులైన డాక్టర్ల దగ్గరకు రారనే నిశ్చితాభిప్రాయంతో ఉన్న నేను పై సూచనను వెనువెంటనే అంగీకరించలేకపోయాను. ఐనా ఆ డాక్టర్ గారి మీద నాకున్న గౌరవం వల్ల, ఆయనలోని సేవాదీక్షను గమనించీ, ఒప్పుకొన్నాను.





తరువాత కొద్ది రోజులకు రోటరీ తరుపున అప్పటి కె.సి.పి. మేనేజర్ ఆంజనేయులు గారు లాంఛనంగా ఈ ఉచిత ఏ.ఎస్.వి. పథకాన్ని ప్రారంభించిన రోజుకు గూడా పాముకాటు రోగులు నాటు వైద్యుల దగ్గరకూ, మంత్రగాళ్ళ వద్దకు తప్ప మా ఆస్పత్రికి వస్తారని నమ్మకం నాకైతే లేదు.

కాని, అనూహ్యంగా పాము కాటు కేసులు మా దగ్గరకు రావటం మొదలయింది. అందుకు కారణమిది - చెరుకు పొలాల్లో రక్త పింజెరలుంటాయి. వ్యవసాయ కూలీలు చెరుకు నరికే సమయంలో అవి వారిని కరవడం పరిపాటి. షుగర్ ఫ్యాక్టరీకి చెందిన



ఫీల్డ్‌మాన్ ప్రతి ఊళ్ళో ఉంటాడు. వారిద్వారా "విషపు పాముల కాటుకు మందులను రోటరీ తరుపున చల్లపల్లిలోని ఫలాన ఆసుపత్రిలో ఉంచాం. ఇంజెక్షన్లు ఉచితం. వెళ్ళండి" అని ముందుగా ఊరూరా చెప్పించారు. ఆ విధంగా రోగులు రావటం మొదలుపెట్టారు.




కేసులు వచ్చేప్పటికి నాకు ఆసక్తయితే బాగా పెరిగింది గాని, వైద్యం మొదలయ్యాక సవాలక్ష సందేహాలు! ప్రతి జబ్బు వైద్యానికీ ఒక ప్రొటోకాల్ ఉంటుంది. ఉదాహరణకు గుండెనొప్పి రోగికి వైద్యంలో ఫస్ట్‌స్టెప్, సెకండ్ స్టెప్... ఇలా ఒకదాని తర్వాత మరొకటి ఏమి చేయాలో నిర్దిష్టమైన విధివిధానం ఉన్నది. కానీ, పాము కాటుకు అలాంటి ప్రొటోకాల్ మా పాఠ్య గ్రంథాల్లో ఎక్కడా లేదు. మెడికల్ కాన్ఫరెన్సులకు పోయినప్పుడల్లా నాకు తెలిసిన, తెలియకపోయినా తారసపడిన వైద్యులందరితో పాము కాటు వైద్యాన్ని గూర్చి పదే పదే చర్చలు జరిపినా సంతృప్తికర సమాధానాలు దొరకటానికెక్కువ కాలమే పట్టింది.

అంతిమంగా మద్రాస్ కాన్ఫరెన్స్‌లో కేరళ గ్రామీణ ప్రాంతాన పదేళ్ళకు పైగా వైద్య వృత్తి నిర్వహిస్తూ, అత్యధికంగా పాముకాటు కేసుల్ని విజయవంతంగా నిర్వహించిన ఒక డాక్టర్ గారు ఈ ప్రత్యేక విషయం మీద ఇచ్చిన ఉపన్యాసంతో నా బుర్రలోని అనేక ప్రశ్నలకు సమాధానాలు దొరికాయి. ఆ కాన్ఫరెన్స్ ముగిశాక గూడ అరగంటసేపా డాక్టర్‌ను ప్రశ్నలతో వేధించి, సందేహాలను నివృత్తి చేసుకున్నాను. ఆయన్ను ఇంటర్వ్యూ చేసిన తర్వాత గాని, ఈ వైద్యంలో నాకు పూర్తి ఆత్మవిశ్వాసం కలుగలేదు. మద్రాస్ రామచంద్రా మెడికల్ కాలేజి ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగంలో ఈ వైద్యాన్ని సన్నిహితంగా పరిశీలించాను. కేరళలోని "తిరువెళ్ళ" ఆసుపత్రి వారి "15 ఏళ్ళ పాము కాటు వైద్యం - 1500 కేసులు" గ్రంథం చదివాక నా అవగాహన మరింత విస్తృతమైంది.

# రాజేశ్వరి ఉదంతం

1993లో మద్రాస్ కాన్ఫరెన్స్‌కు వెళ్ళే నెల రోజుల ముందే ఒకరోజు రాత్రి 11-30 కు నేను నిద్రకు ఉపక్రమిస్తుండగా పాముకాటు రోగి వచ్చిందని కాంపౌండరు ఫోన్ చేశాడు. ఐదే నిముషాల్లో రోగి వద్ద హాజరయ్యాను. 6 నెలల గర్భవతియైన ఆ పేషెంట్ పేరు రాజేశ్వరి. (ఇక్కడా, ఇకముందూ వచ్చే కొన్ని పేర్లు మార్చబడినవి) పాము కరచిన 3 1/2 గంటలకు ఆస్పత్రికి తీసుకొచ్చారు. వాళ్ళ ప్రక్క ఊరి నాటు వైద్యుడామె కంట్లో కలికం, నోట్లో పసరు దట్టించాడు. గంట గడిచాక వాంతులు మొదలైనపుడు - రాత్రి 10 గంటల వేళ పెద్ద ఆసుపత్రికి తీసుకెళ్ళమని పంపేశాడు. రిక్షాలో 4 కిలోమీటర్ల దూరం నుండి మా ఆసుపత్రికి తీసుకొచ్చారు. కలికం వల్లనో, విషప్రభావంతోనో గాని కళ్ళు తెరవలేకపోతున్నది. మా ఈ సందిగ్ధం తీరక ముందే వాంతి చేసుకొన్నది. వాంతులు విషం వల్లనా, పసరు వల్లనా అని తెల్చుకోలేక పోతుండగానే ఆమె ఊపిరి ఆగిపోయింది. ఊపిరితిత్తుల్లోకి కృత్రిమ శ్వాస గొట్టం (ఎండో ట్రేఖియల్ ట్యూబ్) పంపి, కృత్రిమ శ్వాస కల్పించాం. నాడి, రక్తపోటు తగినంతగా ఉన్నాయి. నా దగ్గర ఉన్న 3 కాక, చల్లపల్లిలో దొరికిన 4తో గలిపి మొత్తం 7 ఏ.ఎస్.వి. ఇంజక్షన్లు యిచ్చాం. ఇంకా ఎన్ని యివ్వాలో తెలియలేదు. ఐనా సరే, మరిన్ని ఏ.ఎస్.వి.ల కోసం సమీప పట్టణమైన బందరు పంపాను.

యాంబు బ్యాగ్‌తో ఒక కాంపౌండర్ కృత్రిమ శ్వాస యిస్తూనే ఉన్నాడు. వెంటిలేటర్ మిషన్ మా దగ్గర లేదు. విజయవాడ ఇంటెన్సివ్‌కేర్ యూనిట్‌లలో ఉంటుంది గాని ఆ ఖర్చు భరించే స్తోమత రోగికి లేదు. అందుచేత అలా నాలుగు గంటల పాటు చేతితో ఆ బ్యాగ్‌ను వంతుల వారీగా వత్తుతూనే ఉన్నాం. ఇంకెన్ని గంటలలా కృత్రిమ శ్వాస యివ్వగలమో తెలియదు. వేకువ 3-30 దాటినా బందరు నుండి ఏ.ఎస్.వి.లు రాలేదు. ఆశ నిరాశల అయోమయం! అప్పుడు రోగి కనురెప్పలు కొద్దిగా కదలడం గమనించాను. రాజేశ్వరీ.. రాజేశ్వరీ.. అని పిలవగా, పిలవగా ఆమెలో స్పందన మొదలైంది. తను బ్రతుకుతుందనే ధైర్యం కలిగి, పట్టరాని సంతోషం కలిగింది.



తెల్లవారే సమయానికామె తనంతట తానే ఊపిరి పీల్చుకోవటం మొదలుపెట్టింది. గొంతులోని 'శ్వాస గొట్టం' తీసేశాం. మరి కాసేపట్లో మాట్లాడటం మొదలుపెట్టింది. రాత్రంతా నిద్ర లేక శ్రమించిన మా 8 మంది సంతోషం వర్ణనాతీతం.


ఆ విధంగా మృత్యువును జయించిన రాజేశ్వరి కాలు వాచి ఇన్ఫెక్షన్ రావడంతో గాయం మానడానికి నెల పట్టింది. మరో రెండు నెలల తర్వాత ఆమె చక్కటి బిడ్డను కన్నది.

**ఇక, యీ కేసు అనుభవం నుండి నేను గ్రహించిన గుణపాఠాలివి :**

1. కళ్ళలో కలికం, నోట్లో పసరు పోయడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేకపోగా, విష ప్రభావాన్ని అంచనా కట్టడంలో ఆలస్యం జరిగి, రోగికి నష్టం వాటిల్లుతుంది.
2. పాము కరచిన రోగిని సాధ్యమైనంత తొందరగా ఎం.బి.బి.ఎస్. డాక్టర్ వద్దకు మాత్రమే తీసికెళ్ళి అడ్మిట్ చేయాలి. మరికొన్ని నిముషాలు ఆలస్యమైనా పై రోగిని మేము కాపాడగలిగే వాళ్ళం కాదు.
3. లక్షల విలువైన వెంటిలేటర్ లేకున్నా, కేవలం 2000/- ఖరీదైన యాంబు బ్యాగ్‌తో కృత్రిమ శ్వాసనిస్తూ గూడ ప్రాణం నిలబెట్టవచ్చు.

## కాలమే ప్రాణప్రదాయిని (Time saves life)

చల్లపల్లికి 26 కి.మీ. దూరంలో ఉన్న కోడూరుకు చెందిన ఒక కుర్రవాడిని పాము కరవగా, సుమారు 4 గంటల తర్వాత మా ఆసుపత్రికి తీసుకొని వచ్చారు- సాంప్రదాయ నాటు వైద్యాలన్నీ చేసి చూసిన తర్వాత! చల్లపల్లికి 2 కి.మీ. దూరంలో ఉండగానే చనిపోగా, మృత దేహాన్ని మాత్రం నాకు తెచ్చి చూపారు.




ఇతర వైద్యాల కోసం సమయం వృథా చేయక, మరో అరగంట ముందుగా వచ్చి ఉంటే - యీ బాలుడు కూడా రాజేశ్వరిలాగా బ్రతికేవాడేమో!

## మృత్యుంజయుడు - రామకృష్ణ

చిట్టూర్పు గ్రామంలోని ప్రభాకరరావు మాస్టారి వద్ద చదువుకుంటున్న 12 ఏళ్ళ రామకృష్ణకు తెల్లవారుజాము 3 గంటలకు మూత్ర విసర్జనకు బైటకు వచ్చినప్పుడేదో కుట్టినట్లనిపించింది. మాస్టార్ని లేపి, ఆ విషయాన్ని చెప్తే, అది పాము కాటే కావచ్చని ఊహించి, మోటర్ సైకిల్ పైన 3-30 కి మా ఆసుపత్రికి తీసుకొచ్చారు. మరొక్క పావుగంటలోనే అతని శ్వాస ఆగిపోయింది. చకచకా ఊపిరితిత్తుల్లోకి గొట్టం వేసి కృత్రిమ శ్వాస కల్పించి, ఏ.ఎస్.వి. ఇంజెక్షన్సు 10 యిచ్చాం. రెండు రోజులపాటు మేం వంతుల ప్రకారం ఒకరి తర్వాత ఒకరం యాంబూ బ్యాగ్‌ను వత్తుతూనే ఉన్నాం.అప్పటికిగాని, అతను సహజ శ్వాసలోకి రాలేదు. అతనికిచ్చిన మొత్తం ఏ.ఎస్.వి. ఇంజక్షన్లు 30! ఇప్పుడు అతను చదువుకుని, డప్పు బృందంలో ముఖ్యుడై జీవితంలో స్థిరపడ్డాడు.

పాము కరచిన గంట తర్వాతే విషంతో మరణం సంభవిస్తుందనీ, గంటలోపు చనిపోతే అది భయం వలన వచ్చిన షాక్‌తో మాత్రమేననీ, కొందరు భావించడం తప్పని యిప్పుడు తేలింది. రామకృష్ణను పాము కరచిన 45 నిమిషాలలోపే శ్వాస ఆగిపోయింది. మరొక్క 5 నిముషాలు గడిస్తే కృత్రిమ శ్వాసకు గూడ కాలాతీతమై, అతడు దక్కేవాడు కాదు. సరాసరి రక్తనాళాల లోనికి పాము విషం ఎక్కితే బహుశా 15 నిమిషాలకే రోగి చనిపోయే అవకాశం కూడా లేకపోలేదు.




అందుకే - **పాము కాటు రోగికి డాక్టర్ వైద్యం ఎంత ముఖ్యమో, సకాలంలో ఆస్పత్రిలో చేర్చడం కూడా అంతే ముఖ్యం.**

✻ ఒక మహారాష్ట్ర మత్తువైద్యుడు రూపొందించిన చిన్న వెంటిలేటర్‌ను ఆరేళ్ళ క్రిందట మా ఆసుపత్రి కోసం కొన్నాం. అప్పటి నుండి కట్లపాము, త్రాచుపాము కాట్లతో వచ్చిన రోగులకు కృత్రిమ శ్వాస అందించాలంటే ఈ పరికరాన్ని వాడుతున్నాం.

## మెదడు స్తంభించిన మరణమేనా? (Is it Brain Death?)

ఒకనాటి ఉదయం 3.30 గంటల సమయానికి ఎనిమిదేళ్ళ శ్రీలతను కట్లపాము కరిస్తే చంపిన పాముతో సహా ఆ పాపను తీసుకు వచ్చారు. కొద్ది నిముషాలు నాతో బాగా మాట్లాడింది. "నాకు ఇంజక్షన్‌లు చెయ్యవద్దు" అని బ్రతిమాలింది. కాని, కాసేపటికే మాట్లాడటం ఆగిపోయి నిశ్శబ్దంగా పడుకున్నది. కాళ్ళూ, చేతులూ కొట్టుకోవడం మొదలైంది. నాడి నమోదు యంత్రం (Pulse Oxymeter) లో ఆక్సిజన్ శాతం తగ్గుతూ వచ్చింది. సాధారణ స్థాయి 100 కాగా, 90 వద్దకు పడిపోగానే, ఊపిరితిత్తుల లోనికి గొట్టంవేసి, యాంబు బ్యాగ్‌తో కృత్రిమశ్వాస ఏర్పాటుచేశాం.

శ్రీలత తల్లిదండ్రులు ఇంటెన్సివ్ కేర్ ఖర్చు భరించగలరు. పాపను సమీప నగరానికి తరలించి ICU లో వెంటిలేటర్‌తో కృత్రిమ శ్వాస ఏర్పాటు మంచిదని సలహాయిచ్చాను. దాన్ని వారు తక్షణమే అంగీకరించారు. వెంటనే ఫోన్‌చేసి, కృత్రిమ శ్వాస యంత్రం (వెంటిలేటర్)తో సహా అంబులెన్స్‌నూ, ఇంటెన్సివ్‌కేర్ నిపుణుడినీ రప్పించాం. ఆ స్పెషలిస్ట్ శ్రీలతను పరీక్షించి, గుండెతే పనిచేస్తున్నది గాని, మెదడు స్తంభించిందనీ, 'ఇది బ్రెయిన్ డెత్ కేసు' అని అభిప్రాయపడ్డాడు..

అది బ్రెయిన్ డెడ్ కేసుకాదనీ, 3 రోజులపాటు వెంటిలేటర్‌తో కృత్రిమ శ్వాస యిస్తూ, వైద్యం చేస్తే రోగి చక్కగా కోలుకుంటుందనీ, ఇటువంటి మా ఏడెనిమిది పాము కాటు కేసుల అనుభవాన్ని ఆ డాక్టర్‌కు వివరించాను.

"కంటిపాప పూర్తిగా వ్యాకోచించింది. కనీస స్పందనకూడా లేదు. ఈ పరిస్థితిలో, ఇంత అధిక వ్యయంతో పేషెంట్‌ను ఇంటెన్సివ్‌కేర్ యూనిట్‌కు తరలించినా ప్రయోజనం ఉండదు" అని ఆ స్పెషలిస్టు, ఆయనపై అధికారి చాల మర్యాదగా నా ప్రతిపాదనను తిరస్కరించారు. అంబులెన్స్‌తో సహా ఆ స్పెషలిస్టు తిరిగి వెళ్ళారు.

ఆ తరువాత కథ మామూలే! ఒకరి తర్వాత ఒకరం, నేనూ, మా సిబ్బందీ రెండు రోజులపాటు నిర్విరామంగా యాంబు బ్యాగ్‌తో శ్రీలతకు కృత్రిమ శ్వాస కల్పిస్తూనే ఉన్నాం. సుదీర్ఘ వైద్యం తర్వాత ముందుగా ఆమె కనురెప్పలలో

చిన్న కదలిక! ఆ పిదప ఆమె కాలివేళ్ళ కొనలలో మరికొన్ని స్వల్ప చలనాలు. అప్పుడిక నెమ్మదిగా కళ్ళు విచ్చుకొన్నాయి. మా మాటలకామెలో ప్రతి స్పందనలు మొదలయినవి. నెమ్మదిగా తానే శ్వాస పీల్చుకోవటానికి ప్రయత్నిస్తున్నది. మరో ఐదారు గంటలపాటు కృత్రిమ శ్వాస కొనసాగించిన తర్వాత శ్వాసగొట్టాన్ని ఊపిరితిత్తుల నుండి తీసేశాం. తర్వాత రోజు తానే లేచి కూర్చున్నది. తర్వాత మంచందిగి నడవ గల్గింది. ఆ మరుసటి రోజే ఆసుపత్రి నుండి ఆమెను డిశ్చార్జి చేశాం.

**త్రాచు, కట్ల పాములు కరిచిన కేసులలో కనుపాపల ప్రతి స్పందనలతో నిమిత్తం లేదని యీ కేసుతో మా కర్థమయింది.**

పాము కాటు వైద్యంలో మాకిదొక వినూత్న, ఉత్కంఠ భరితమైన అనుభవం!

## రామసుబ్బయ్య ఉదంతం

నిత్యం మందహాసంతో కనిపించే మంచిమనిషి రామసుబ్బయ్య. 16 ఏళ్ళుగా నేను వాళ్ళ ఫ్యామిలీ డాక్టర్‌ను.

ఓ ఆదివారం ఉదయం వాంతులై నీరసించిపోతే ఆసుపత్రికి తీసుకువచ్చారు. అప్పటికి 32 గంటల క్రితం ఆయన్ను పాము కరిచిందట! "సార్! పాముకాటుకు వైద్యమంతా మేం చేయించాం. వాంతులు తగ్గేందుకొక ఇంజక్షను చేసి, నీరసం తగ్గేందుకు సెలైన్ పెట్టండి..." అని వారి బంధువులు నన్నడిగారు. వాళ్ళ మాటలు పట్టించుకోకుండ, అన్ని పరీక్షలూ చేసి చూస్తే - ఆయన రీనల్ ఫెయిల్యూర్ (మూత్రపిండ వైఫల్యం) లో ఉన్నాడు. ఆయన్ని కరిచింది రక్తపింజరై ఉండాలి. మూత్రపిండాల్ని పాడుచేసి, రక్తం గడ్డకట్టనీయని లక్షణం ఆ పాము విషానికే ఉంటుంది మరి.

అర్జెంటుగా నెఫ్రాలజిస్టు (మూత్రపిండాల స్పెషలిస్టు) దగ్గరకు తీసుకెళ్ళమని చెప్పాను. ఓ ప్రక్క రోగి పరిస్థితి క్షణక్షణానికి విషమిస్తూంటే - రోగికి వైద్యం చేసిన నాటువైద్యునితోపాటు, వచ్చిన బంధువులంతా - "అవసరం లేదు సార్! రామసుబ్బయ్య భార్యకు పాము కరిస్తే యితడే వైద్యం చేశాడు. ఇదిగో ఆమె నిక్షేపంగా ఉంది చూశారా? మా ఊళ్ళల్లో ఎంతమందిని ఈయన బ్రతికించాడో తెలుసా? రామసుబ్బయ్యకు కూడ యీయన చేయవలసిన వైద్యం పూర్తిగా చేశాడు. మీరిప్పుడతనికి నీరసం తగ్గేందుకు సెలైన్ పెట్టండి చాలు". అని నాకే భరోసా యిచ్చారు. ఐనా, పరిస్థితి గమనించిన నేను పట్టుబట్టి

బలవంతాన విజయవాడలోని మూత్రపిండాల స్పెషలిస్టు దగ్గరకు పంపాను. అక్కడ లక్షన్నరతో అత్యుత్తమమైన వైద్యమే జరిగింది కాని, అప్పటికే ఆలస్యమవ్వడం వల్ల పెద్ద పెద్ద డాక్టర్లు కూడా అతణ్ని వారం రోజులు మాత్రమే బ్రతికించగలిగారు. **ఆలస్యంగా డాక్టరు దగ్గరకు వస్తే ఎంత మంచి వైద్యంతోనైనా ప్రయోజనం ఉండదు.**

## తిరువూరు డాక్టరు అనుభవం

తిరువూరులోని నా మిత్రుడు డాక్టర్ రవీంద్ర వద్దకు ఒక రాత్రి 11 గంటల సమయంలో ఒక వ్యక్తిని తీసుకువచ్చారు. "ఉదయం 8 గంటలకు పాము కరిచింది. మేం పొద్దునే వైద్యమంతా చేయించాం. సాయంత్రం నుంచి వాంతులై నీరసంగా ఉన్నాడు. నీరసానికి మందు వాడండి" అని అడిగారట. అర్జంటుగా ఏ.ఎస్.వి. చెయ్యాలని డాక్టర్ ఎంత చెప్పినా వాళ్ళ తలకెక్కలేదు. బంధువులంతా సెలైన్ పెడితే చాలని ఏకగ్రీవంగా పట్టుపట్టారు. "నేను చెప్పింది నచ్చకపోతే మరొక డాక్టర్ దగ్గరకు వెళ్లండి. ఒక్క నిముషం ఆలస్యం కూడ ప్రమాదమే" అని డా॥ రవీంద్ర ఎంత మొత్తుకున్నా వినకుండా రోగిని యింటికి తీసుకుపోయారు. కనీసం మరో డాక్టర్ సలహా కూడ తీసుకోలేదు! తెల్లవారుజామున 4 గంటలకు అత్యంత ప్రమాదకర స్థితిలో వేరే డాక్టర్ వద్దకు తీసుకుపోతే, ఆయన ఏ.ఎస్.వి. చేసి, వెంటనే హైదరాబాదు పంపాడు. అక్కడ వేలల్లో ఖర్చయింది గానీ, మనిషి దక్కలేదు.

**తగిన సమయంలో ఏ.ఎస్.వి. ఇవ్వకపోవడమే యిక్కడ జరిగిన లోపం.**

***మరో రెండు అనుభవాలు :*** ఇటీవల ఒకరోజు సాయంత్రం జగన్మోహరావు అనే 40 సం॥రాల వ్యక్తిని రక్తపింజర కరిస్తే తీసుకువచ్చారు. 30మంది బంధుమిత్రులు ఆసుపత్రి హాలులో భయాందోళనలు చెందుతూ, మా సిబ్బందిని కంగారు పెడుతున్నారు. అటు చూస్తే రోగి పరిస్థితి విషమిస్తూంది. ఎవరినీ గుర్తు పట్టడం లేదు. కాళ్ళు, చేతులు కొట్టుకుంటూ మహాచిరాకుగా, అశాంతి (Irritable) గా ఉన్నాడు.

ఒక వంక రోగి బంధువుల్ని శాంతింపజేస్తూ, మరోవంక రోగి కాళ్ళు, చేతుల్ని గట్టిగా అదిమి పట్టుకొని బి.పి చూసి, ఒకచేతికి సెలైన్ పెట్టి, వెంటనే 10 డోసులు ఎ.ఎస్.వి. ఇచ్చాం. ఏమార్పు కనిపించక పోగా మరో 10 డోసులు కూడా చేశాం. కొంచెం ఫరవాలేదనుకుంటుండగానే 5 నిమిషాలలోనే పెద్ద వాంతి అయ్యింది.

అప్పుడు మళ్ళీ 10 ఇంజక్షన్లు చేశాం. అప్పటికి అతని రోగ ప్రకోపం కొంత తగ్గింది. ఆ తరువాత మమ్మల్ని, బంధువులని గుర్తు పట్టగలిగాడు.

ఈ వైద్యమంతా గమనించిన నా డాక్టర్ మిత్రుడు "ఒకేసారి ఇంత తక్కువ వ్యవధిలో 30 ఇంజక్షన్లు ఇవ్వడమా? డోసులెక్కువైపోయి రియాక్షన్ వచ్చే అవకాశం ఉంది కదా? దానికి బదులు సెలైన్‌లోనే ఎ.ఎస్.వి.ని కలిపి రోగికి ఎక్కిస్తే సరిపోదా..." అని సందేహం వ్యక్తపరిచాడు.

రోగి రక్తంలోని విషం మోతాదును కొలిచే పరికరాలు ఇప్పటికింకా మన దేశంలో లేవు. రక్తంతో పాటు శరీరభాగాలన్నిటికి ప్రసరిస్తున్న పాము విషాన్ని విరిచి, తటస్థీకరించాలంటే ఎన్ని ఇంజక్షన్లు ఇవ్వాలో రోగి లక్షణాలను బట్టి అప్పటికప్పుడు నిర్ణయించాల్సిందే. సాధారణంగా రక్తపింజర విషానికి 5 నుండి 35 వరకు అవసరమవ్వడం నా అనుభవంలో గ్రహించాను. రోగి సాధారణస్థితి (General Condition) నిలకడగా వుంటే తొలుత 10 ఇంజక్షన్లు ఇచ్చి పరిశీలనలో వుంచుతాం. **ప్రారంభంలోనే రోగికి విష లక్షణాలు తీవ్రంగా వుండి కొనసాగుతుంటే 35 వరకు డోసులివ్వక తప్పదు. అంతే గాని సెలైన్‌లో కలిపి ఎ.ఎస్.వి.ని నెమ్మదిగా ఎక్కించడం సరికాదు, సరాసరి సిర (Intra venous) లోనికి ఎక్కించడమే మెరుగైన చికిత్స. (నేషనల్ ప్రోటోకాల్-2009కి నేను పాటించే ఈ ఒక్క పద్ధతే భిన్నం)**

మరో రెండు రోజులలోనే రాఘవమ్మ అనే స్త్రీని రక్తపింజరే కరిస్తే హడావుడిగా ఆసుపత్రికి తెచ్చారు. వచ్చీ రాగానే ఆమెకు కళ్ళు తిరిగినట్లై పడిపోయింది. రక్తపోటు 40 మాత్రమే వుంది. తక్షణమే సెలైన్ పెట్టి, బి.పి. 100 దాటగానే వరుసగా 20 డోసులు ఎ.ఎస్.వి. ఇచ్చాం. కేవలం అరగంటలోనే ఆమె చక్కగా మాట్లాడింది. రెండు రోజులు పరిశీలనలో వుంచి ఇంటికి పంపించాం.

## ఒక డాక్టరు గారి సందిగ్ధం

ఒకరోజు రాత్రి 11 గంటలకు ఒక డాక్టర్ మిత్రుని నుంచి ఫోన్. "ఒక వ్యక్తి కాలుకు పాము కరిచింది. ఏ పామో తెలియదు. నొప్పి విపరీతంగా ఉంది" అని. బ్లడ్ క్లాటింగ్‌టైం (రక్తం గడ్డకట్టే సమయం)తో సహా కొన్ని రక్త పరీక్షలు చేయించమన్నాను. క్లాటింగ్ టైమ్ 4 నిముషాలని మళ్ళీ ఫోన్‌లో చెప్పారు. పాము కరచిన కాలివైపు గజ్జల్లో బిళ్ళ కట్టిందని, నొక్కితే భరించరానంత నొప్పిగా ఉందనీ చెప్పారు. కాలికైతే గజ్జల్లోనూ, చేతికైతే చంకల్లోనూ బిళ్ళలు కట్టి నొప్పి వచ్చేది రక్తపింజర కరిస్తేనే. అందుకని, నేను మళ్ళీ ఫోన్‌లోనే "క్లాటింగ్ టైమ్

# ఇవే విష సర్పాలు



త్రాచుపాము




కట్లపాము




రక్త పింజెర



హంప్ నోస్‌డ్ పిట్ వైపర్



సాస్కేల్డ్ వైపర్ (పుర్సా)



ఇలా రెండో, మూడో గాట్లుంటే - విషసర్పం కరిచినట్లు.



త్రాచు, కట్లపాము కాట్లతో శ్వాస ఆగినప్పుడు రోగికి
యాంబు బ్యాగ్‌తో కృత్రిమ శ్వాస ఏర్పాటు.



**A.S.V.**, కృత్రిమ శ్వాసలతో 24 గంటల పిదప
కోలుకుని, కులాసాగా ఉన్నరోగి.



త్రాచు లేక కట్ల పాముకాటు రోగి తొలి లక్షణం PTOSIS
రామకృష్ణ కళ్ళు మూతలు పడుతున్న స్థితి



48 గంటల పాటు యాంబు బ్యాగ్ వెంటిలేషన్ తర్వాత,
సహజ శ్వాసలో రామకృష్ణ.



మూడు రోజుల తర్వాత పూర్తిగా కోలుకున్న రామకృష్ణ.




రక్తపింజెర విషం వల్ల కంటిలో రక్తస్రావం



రక్తపింజెర విషంతో వాచిన కాలు



రక్తపింజెర విషం వలన నిర్జీవమైన
మోచేతి క్రింది భాగం



రిపోర్టు తప్పేమో. ఈ సారి స్వయంగా నువ్వే ఆ టెస్టు చేసిచూడు" అని చెప్పాను. ఆయన చేసిన క్లాటింగ్ టెస్ట్‌లో నాలుగు కాదు - 20 నిముషాలు దాటినా రక్తం గడ్డకట్టలేదు! మరింక అనుమానవేు లేదు. ఆ రోగిని కరిచింది రక్తపింజరే. ఇక ఆలస్యం చేయకుండా వెంటనే ఏ.ఎస్.వి. పది ఇంజెక్షన్లు యివ్వమని చెప్పాను. ఆ విధంగా ఆరేడు గంటల పోరాటంతో ఆ వ్యక్తి బ్రతికిపోయాడు.

**లేబొరేటరీ పరీక్షనే పూర్తిగా నమ్ముకొని పాముకాటుకు వైద్యం చేయరాదు. అవసరమైతే డాక్టర్ స్వయంగా పునః పరీక్షించి, ధృవీకరించుకోవాలి.**

**అంతేగాదు, క్లినికల్ కండిషన్, లాబొరేటరీ డేటా ఏకీభవించనపుడు క్లినికల్ ఎవాల్యుయేషన్ ప్రకారమే వైద్యం చేయాలి.**

## జనారణ్యంలో విష సర్పాలా?

రెండు దశాబ్దాల క్రితం హైదరాబాద్‌లో ఎమర్జెన్సీ మెడికల్ కాన్ఫరెన్స్ జరిగినపుడు అపోలో ఎమర్జన్సీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్ గార్ని "సార్! మీ ఆసుపత్రిలో స్నేక్ పాయిజన్ ట్రీట్‌మెంట్‌కి ప్రొటోకాల్ ఏమిటి?" అని అడిగితే ఆయన బిగ్గరగా నవ్వారు. ఎందుకు నవ్వుతున్నారని అడిగితే, "ఈ హైదరాబాద్ మహానగరం రద్దీలోకి పాము వస్తుందా? వచ్చి బ్రతుకుతుందా? పాము కాటు కేసులు మాకు రానూరావు, మాకా అనుభవమూ లేదు" అని వివరించారు.

నిజమే! పట్టణాల్లో పాములంతగా వుండవు. పల్లెటూళ్ళలోనే ఎక్కువగా వుంటాయి, కరుస్తాయి! కాని, ఆ పాముకాటు కేసులు అర్హులైన డాక్టర్ల దగ్గరకు కాక, నాటు వైద్యుల దగ్గరకో, మంత్రగాళ్ళ దగ్గరకో పోతాయి. ఇదీ పరిస్థితి!

అన్ని రాష్ట్రాల డాక్టర్లు పాల్గొన్న ఆ సమావేశంలోనే పాము కాటు కేసుల మీద ఆసక్తి ఉన్న 50-60 మందిమి ఓ గంటకు పైగా ప్రత్యేకంగా దీన్ని గురించి చర్చించాం. చర్చల సారాంశమిది : ఎవరి అనుభవాన్ని బట్టి వారు పాముకాటుకు వైద్యాలు చేస్తున్నారే తప్ప ఒక నిర్దిష్ట విధానమేమీ లేదు. "పాము విషానికి విరుగుడు ఏ.ఎస్.వి. తప్ప మరొకటి లేదు". అనే ఒక్క విషయంలో మాత్రం అందరిదీ ఏకాభిప్రాయమే.

# నాటు వైద్యంతో బ్రతకటం నిజమా?

"నాటు వైద్యంతో, మంత్రంతో బ్రతికిన వాళ్ళను చాలామందిని చూశాం!"

చాలెంజ్ లాంటి ఈ మాటను గ్రామీణ ప్రాంతాల్లో మనం తరచూ వింటుంటాం. మనం కూడ అలా బ్రతికిన అదృష్టవంతుల్ని చూసే ఉండొచ్చు.


అన్ని పాములూ విష సర్పాలు కావు. విషం లేని పాములు కరిస్తే, ఏ రకమైన వైద్యం చేసినా, అసలు చేయకపోయినా, ప్రాణహాని ఉండదు. మహా ఐతే కరచిన చోట కొంచెం వాపురావచ్చు. నొప్పి కలుగవచ్చు. ఇలాంటి వారికి మంత్రాలు, నాటు వైద్యాలు కొంత ధైర్యాన్ని కల్గించడం మినహా మరే ప్రయోజనమూ ఉండదు.

మన దేశంలోని 250 జాతుల పాముల్లో 52 విషసర్పాలు. మనిషికి ప్రమాదం చేయగల విషసర్పాలు 5 రకాలు. త్రాచు పాము, కట్లపాము, రక్తపింజెర (దీన్నే గుమ్మడిత్తుల పెంజర, పొడపాము అనికూడా అంటారు), సాస్కేల్డ్ వైపర్ (ఫుర్సా), హంప్‌నోస్డ్ పిట్ వైపర్. వీటిలో మొదటి మూడు రకాలే మన ప్రాంతంలో ఉంటాయి. నాల్గవ రకమైన సాస్కేల్డ్ వైపర్ ఉత్తర భారతదేశంలో ఉంటుంది. ఐదవది కేవలం కేరళ అడవుల్లోనే వుంటుంది. సముద్రపు పాములన్నీ విషపూరితాలే కాని, మనదేశంలో ఆ పాము కాట్లు చాలా అరుదు.

'పై విషసర్పాలు కరిచినా సరే, నాటు వైద్యంతో బతికిన వాళ్ళను చూశాం...' అంటారా? అది నిజమే కావచ్చు గానీ పాక్షిక సత్యం! ఎలాగంటారా?

ఒకరోజు ప్రొద్దుటే 6 గంటలకు ఒక యువకుడు తనను కరచిన రక్త పింజరను చంపి, తీసుకొని వచ్చాడు. సాధారణంగా పాముకాటుతో వచ్చిన వారందర్నీ 24 గంటల పాటు హాస్పిటల్‌లో ఉంచి, నిరంతర పరిశీలన (అబ్జర్వేషన్) లో ఉంచుతాం. ఆ సమయంలో నోటి ద్వారా ఆహారం యివ్వం. అలాగే యీ యువకునికి గూడ టెట్వాక్ యింజక్షన్ ఇచ్చి, సెలైన్ పెట్టి 'పరిశీలన'లో ఉంచాం.

అదేరోజు సాయంత్రం 6 గంటలకు వేరే గ్రామం నుండి ఇంకొకాయన కూడా తనను కరిచిన పామును చంపి తీసుకొచ్చాడు. అదీ రక్తపింజరే. ఇతడిని కూడ అబ్జర్వేషన్‌లో ఉంచాం. మరొక రెండు గంటల్లోనే యితడు పెద్ద నెత్తురు వాంతి చేసుకొన్నాడు. పింజెర విషప్రభావం అది. చిగుళ్ళ నుండి, నోటి నుండి, మూత్రనాళం నుండి, ఆసనం నుండి, సెలైన్ పెట్టిన రంధ్రం నుండి, పాము కరచిన గాట్ల నుండి... ఎక్కడ నుండైనా యీ రక్తస్రావం జరగొచ్చు. ఇతనికి



జీర్ణాశయంలో రక్తస్రావం జరిగి, నోటిద్వారా పెద్ద రక్తపు వాంతి అయింది. అప్పుడిక వరుసగా 10 ఏ.ఎస్.వి. ఇంజక్షన్లు చేశాం. అర్ధరాత్రి దాటాక నెమ్మదిగా కోలుకున్నాడు. ఈ వ్యక్తికి విషప్రభావం కనిపించిన కొద్ది సేపటికే విరుగుడు మందు ఇవ్వడం వల్లనే బ్రతికాడు. నాటు వైద్యంతో గానీ, మంత్రవైద్యంతో గానీ బ్రతికే అవకాశం లేనేలేదు.

ఇక మొదటి వ్యక్తి సంగతి. మర్నాడు ఉదయం 6 గంటల వరకు పరిశీలనతో ఉంచినా, ఎలాంటి విష లక్షణాలూ కనిపించలేదు. ఐతే అతడిని కరిచిందీ రక్తపింజరే. అందులో సందేహమే లేదు. అతని వంటిపై పాముగాట్లూ, అతడే స్వయంగా చంపి తెచ్చిన రక్తపింజెరా అందుకు తిరుగులేని సాక్ష్యాలు. మరి నేను మందు వేయకుండానే అతడెలా బ్రతికాడు?

**అతడిని ఆ పాము కరిచిందేగాని, విషం ఎక్కించలేదు. ఇతనికి నాటు వైద్యం చేసినా, నోరులేని మూగవాడు మంత్రం చదివినా, చారెడు దుమ్మో, నీళ్ళో పైన చల్లి అదే వైద్యమన్నా కూడ యిలాగే బ్రతికేవాడు! 24 గంటల తర్వాత ఇతడిని ఇంటికి పంపించాం.**

## ఉత్తుత్తి పాముకాటులు (Dry Bites)

విష సర్పాల కాటులలో సుమారు 30 నుండి 50 శాతం విషం ఎక్కని, ఉత్తుత్తి కాటులే ఉంటాయి. అనేక కారణాల వల్ల విషసర్పాలు కరిచిన ప్రతిసారీ తగిన మోతాదులో విషం ఎక్కక పోవచ్చు. వీటినే డ్రైబైట్స్ అంటారు. ఈ ఉత్తుత్తి కాటులే నాటు వైద్యులకు, మంత్రగాళ్ళకు గుర్తింపును, కీర్తిని తెచ్చిపెట్టేవి!

**సరైన మోతాదులో పాము విషం శరీరంలోకి ఎక్కితే ఏ.ఎస్.వి.తో తప్ప ఈ ప్రపంచంలో మరే వైద్యం వల్లనైనా ఎవరైనా బ్రతికిన దాఖలా యింతవరకూ లేదు.**

## పాముకాటులు - విష లక్షణాలు

త్రాచుపాము, కట్లపాముల్లో ఉండే విషం 'న్యూరోటాక్సిన్'. ఈ విషం నరాల మీద, కండరాల మీద ప్రభావం చూపటం వల్ల పాముకాటు రోగులకు కండరాలు పనిచేయవు.

* రోగుల మొదటి లక్షణం- కళ్ళు మూతపడిపోవడం. మనం కళ్ళు తెరవమంటుంటే భృకుటి ముడి పడుతుందే గాని, కనురెప్పలు సరిగా తెరవలేరు.
* రెండోది- వాంతి కాబోతున్నట్లనిపించడం, కొంతసేపటికి నిజంగానే వాంతులు కావడం.
* ఒకే మనిషి ఇద్దరుగా కనపడటం.
* చేతులు, కాళ్ళు కొట్టుకోవడం.
* మరికొంత సేపటికి శ్వాస కండరాలు పనిచేయక ఊపిరి ఆగిపోవడం.
* ఆ తరువాత గుండె కొట్టుకోవటం ఆగి, రెండు లేక మూడు నిమిషాలకు మెదడు స్తంభించి, (బ్రెయిన్ డెత్) మరణం ప్రాప్తించడం.
* రక్తపింజర విషం శరీరంలోని ఏ భాగంలోకి ఎక్కితే ఆ భాగం వాస్తుంది. దగ్గరలో ఉన్న లింపు గ్రంథులూ వాస్తాయి. గజ్జల్లోనో, చంకల్లోనో బిళ్ళలు కడతాయి. భరించలేనంతగా నొప్పి వస్తుంది. ఆ తరువాత రక్తస్రావం మొదలౌతుంది. శరీరంలోని ఏ భాగం నుండైనా యీ రక్తస్రావం జరగవచ్చు. మెదడులోగనుక జరిగితే రోగి కోమాలోకి వెళ్ళిపోతాడు.
* ఒక్కోసారి రక్తపింజర విషం మూత్రపిండాలను దెబ్బ తీస్తుంది. కిడ్నీలు పని చేయకపోతే రక్తంలోని వ్యర్థ పదార్థాలు శరీరంలో పెరిగిపోయి - యురీమియా వల్ల మరణం సంభవిస్తుంది.
* కట్లపాము కరిచినపుడు తీవ్రమైన మగత, నీరసం, తూలు రావచ్చు. అది పాము కాటు అని గమనించక పక్షవాతమనో, ఒంట్లో షుగర్ స్థాయి పడిపోయిందనో, సారా త్రాగటం ఎక్కువైందనో సర్ది చెప్పుకొని సెలైన్ పెట్టిస్తూ కాలక్షేపం చేయకూడదు. ముఖ్యంగా తెల్లవారే సమయంలో అయితే అది కట్లపాము కాటుగా అనుమానించి, విషలక్షణాలను గుర్తించి, ఏ.ఎస్.వి. ఇంజక్షన్ల వైద్యం ప్రారంభించాలి.

## సామాజిక నేపథ్యం

పాము కాటుకు గురయ్యే వారిలో నూటికి 80 మంది రెక్కాడందే డొక్కాడని వ్యవసాయ కూలీలే.  చెరకు జడ వేసేప్పుడో, చెరకు కోతలప్పుడో, మినప పీకుడు సమయంలోనో, వాముల్లోంచి వరిగడ్డి లాగేప్పుడో అవి కరుస్తుంటాయి. అప్పుడప్పుడు గృహిణులు కూడ పాముకాట్లకు గురౌవుతున్నారు. పూరిపాకల్లో, పెంకుటిళ్ళలో నివసించే వారికే గాక, డాబాల్లో ఉంటూ నేలమీద నిద్రించే వారికి గూడ పాము కాట్లు తప్పడం లేదు.

ఎక్కువ సందర్భాల్లో పాము కాటుకు 10 ఏ.ఎస్.వి. డోసులివ్వవలసి వస్తుంది. ఒక్కోడోసు 600 రూపాయల చొప్పున ఇంజక్షన్లకే ఆరువేలు, ఇతర ఖర్చులతో గలిపి 15-20 వేల ఖర్చు గ్రామీణ పేదలకు తలకు మించిన భారమనక తప్పదు.

## పాపం కోటేశ్వరమ్మ!

ఆమెది కొక్కిలిగడ్డ కొత్తపాలెం. వయస్సు 40 ఏళ్ళు. రక్తపింజెర కరచిన గంటలోపే తీసుకువచ్చారు. మూడు గంటల తర్వాత కరచిన చోట వాపు పెరిగి గజ్జల్లో బిళ్ళ కట్టింది. రక్తం గడ్డ కట్టడం లేదు. 10 ఏ.ఎస్.వి.లు యిచ్చాక ప్రాణగండం తప్పింది గాని, మూత్రపిండాలు పాక్షికంగా దెబ్బతిన్నవి. విజయవాడ నెఫ్రాలజిస్టు దగ్గరికి తీసికెళ్ళి ఒకటి రెండు సార్లు డయాలసిస్ (రక్తశుద్ధి) చేస్తే తప్ప ఆమె ఎక్కువ కాలం బ్రతకదని వివరించి చెప్పాను. ఐతే ఆమెది దయనీయమైన ఆర్థికస్థితి. సెంటు భూమి లేదు, గేదెలు కాచుకొని బ్రతుకీడుస్తున్నది. బంధువులు  తలా పదీ, పరకా వేసుకొని, నా ఆసుపత్రిలో చేర్చారు. ఇదంతా నాకు వివరించి వాళ్ళు నిస్సహాయంగా తమ ఊరికి తిరిగి వెళ్ళేందుకు సిద్ధపడ్డారు. నేను మళ్ళీ వాళ్ళను ఆపి, విజయవాడలోని నెఫ్రాలజిస్టు డాక్టర్ అమ్మన్న గారికి ఉన్న పరిస్థితంతా వివరించి చెప్తే, ఆయన పెద్ద మనస్సుతో - "మందులు మాత్రం వాళ్ళు కొనుక్కోగలిగితే, నేను వైద్యమంతా ఉచితంగా చేస్తా"నన్నారు. నా ఆస్పత్రి ఫీజులకు, బిల్లులకు వారేమీ చెల్లించనవసరంలేదనీ, ఆడబ్బుతో విజయవాడలో మందులు కొనవచ్చనీ, వారిని ఒప్పించి, ఎలాగో విజయవాడ పంపించగా, డయాలసిస్ జరిగి, ఇప్పుడా కోటేశ్వరమ్మ యధావిధిగా తన బ్రతుకు తాను బ్రతుకుతున్నది.

ఇందులో కొసమెరుపేమిటంటే-ఈ కోటేశ్వరమ్మ సంవత్సరం తిరిగేసరికి, రక్తపింజర కాటుతో మళ్ళీ నా దగ్గరికి వచ్చింది. సకాలంలో పది ఎ.ఎస్.వి.లతో పునఃపునర్జీవించింది.

# సానుకూల పరిణామం

రోటరీ వారి ధర్మమా అని మూడు సంవత్సరాల పాటు ఏ.ఎస్.వి.లు ఉచితంగా పొంది చాలామంది బ్రతికి బట్టకట్టారు. ఆ ఉచిత పథకం ఆ తర్వాత ఆగిపోయినా పాము కాటు రోగులు డాక్టర్ల దగ్గరకు బాగానే వస్తున్నారు. పాము విషానికి నాటు వైద్యమే సరైనదని, ఇంగ్లీషు వైద్యం దండగ మారిదనే బలమైన




నమ్మకం సడలిపోయి, ఏ.ఎస్.వి. అనే విరుగుడు మందే నమ్మకో దగిందనే గట్టి విశ్వాసం ఇటీవలి కాలంలో చల్లపల్లి ప్రాంతపు జనంలో బలపడింది. ఇప్పటికీ దురదృష్టవశాత్తు కొన్ని పాము కాటు కేసులు నాటు వైద్యుల దగ్గరకు వెళుతున్నా, ఎం.బి.బి.ఎస్. డాక్టర్ల దగ్గరకు పోయి, ప్రాణగండం దాటుతున్న వారి సంఖ్య క్రమంగా 95శాతం దాటింది. ఈ ప్రాంతంలో వచ్చిన యీ పరిణామక్రమానికి రోటరీ - కె.సిపి. సంస్థలూ, జనవిజ్ఞానవేదికా కారణాలని చెప్పాలి. ఇటీవల చల్లపల్లి సమీప గ్రామంలోని ఒక ప్రముఖ సీనియర్ నాటు వైద్యుడు తన బంధువును పాము కరిస్తే తాను చేయవలసిన వైద్యం చేసి వెంటనే ఆ పేషెంట్‌ను ఇంగ్లీషు వైద్యం కోసం నా దగ్గరకు పంపారు.

పరిమి గారి 'జీవన వికాస విద్యావనం' పాఠశాల (అడవినెక్కలం)లో మా అవగాహనా సదస్సు జరిగిన కొద్దిరోజుల తర్వాత ఆ ప్రాంతానికి ఒక పాము వచ్చినపుడు, ఆ పిల్లలు దాన్ని చంపకుండా ప్రక్కన పొలాల్లోకి పంపడం

పర్యావరణ రక్షణలో పాముల ప్రాముఖ్యతను విద్యార్థులు గ్రహించారనడానికి నిదర్శనం.

వేయికి పైగా పాముకాటు కేసులకు చికిత్స చేసిన నా అనుభవంలో కేవలం ఒక్క కేసులో మాత్రమే పాము కరిచిన పదకొండున్నర గంటల తరువాత విషప్రభావం కనిపించింది. మిగిలిన అన్నింటిలోనూ ఆరుగంటల లోపే విషలక్షణాలు కనిపించడం గమనార్హం.


కృష్ణాజిల్లాలో పేపర్లో పడిన పాముకాటు మరణాలు ఒక సంవత్సరంలో 55 దాక లెక్కించాం. పేపర్ కందని దురదృష్ట మరణాలెన్నో మరి! వీరిలో కనీసం 52 మందిని పల్లెప్రాంతాల ఎం.బి.బి.ఎస్. డాక్టర్లు బ్రతికించగలరనేది మా అనుభవపూర్వకమైన అంచనా.

ఇక మిగిలిన ఆ రెండు మూడు కేసులకూ స్పెషలిస్టు డాక్టర్స్ అవసరమౌతారు - రక్త పింజెర కాటు వల్ల మూత్రపిండాలు చెడినప్పుడో, రక్త స్రావ మధికమై తీవ్ర ప్రమాదంలో ఉంటేనో! మిగతా అన్ని కేసులకూ గ్రామీణ ప్రాంతపు ఎం.బి.బి.ఎస్. డాక్టర్లూ, ప్రైమరీ హెల్త్ సెంటర్స్ వైద్యులూ సరిపోతారు. ఇందుకోసం వాడే పరికరాల ఖరీదు నాలుగైదువేలకు మించదు.

## ఏ.ఎస్.వి. అంటే....

యాంటీ స్నేక్ వీనమ్. పాము విషానికి విరుగుడు మందన్నమాట. ఒకప్పుడీ ఇంజక్షన్లు సులభంగా దొరికేవి కావు. అదృష్టవశాత్తు ప్రస్తుతం 3,4 కంపెనీలు తయారుచేస్తున్న ఏ.ఎస్.వి.లు డిమాండ్‌కు సరిపడా మార్కెట్లో దొరుకుతున్నాయి.

ప్రధాన విష సర్పాలైన త్రాచు, రక్త పింజర, సాస్కేల్డ్ వైపర్ (పుర్సా), కట్లపాముల విషాలను విడి విడిగా అతి తక్కువ మోతాదుల్లో గుర్రాల శరీరాల్లోని కెక్కించినప్పుడు వాటిలో'యాంటీబాడీస్'



తయారౌతాయి. అప్పుడా నాలుగు రకాల యాంటీబాడీస్‌ను కలిపి యాంటీ స్నేక్ వీనమ్ (ఏ.ఎస్.వి.) తయారు చేస్తారు. ఇది పై నాలుగు రకాల పాము విషాలకూ విరుగుడుగా పని చేస్తుంది. గర్భవతులకు, పసిపిల్లలకు కూడ ఈ ఇంజక్షన్లే ఇవ్వాలి.

**ప్రభుత్వం అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కనీసం 10 ఏ.ఎస్.వి.ల చొప్పున నిల్వ ఉంచాలి.**

మరి ప్రభుత్వం ఇంతటి నిర్ణయం తీసుకోవాలంటే ప్రజల నుండి వత్తిడి రావాలి. పంచాయితీ వార్డు మెంబరు, సర్పంచ్, ఎం.పి.టి.సి., జడ్.పిటి.సి. మెంబర్లు, ఎమ్మెల్యే, ఎం.పి.లతో సహా ప్రజా ప్రతినిధులందరికీ పాము కాటు మరణాలు - వైద్యాలపై అవగాహన కల్పించాలి. ఇవన్నీ జరిగినప్పుడు రెండు మూడేళ్ళలో యీ మరణాలను గణనీయంగా తగ్గించవచ్చు. ఇప్పుడు కొన్ని ప్రాథమిక వైద్య కేంద్రాలలో 10 ఎ.ఎస్.వి. డోసులు నిల్వ ఉంచటం సంతోషకర పరిణామం.

పాము కాటుకు ప్రథమ చికిత్సను గూర్చి అందరికీ కనీస అవగాహన కల్పించాలి. పాఠశాలల విద్యార్థులకూ యీ అవగాహన అవసరం. ఏ.ఎస్.వి. మాత్రమే పాము విషాన్నుంచి రక్షించగలదనే ప్రాథమిక అవగాహనను విస్తృతంగా ప్రజలంతా ఒకరితో ఒకరు చర్చించాలి. పాము కాటు రోగి చుట్టూ పది మంది చేరి నిరుపయోగమైన పలురకాల సలహాలిచ్చే సమయంలో యీ అవగాహన ఉన్నవారే గట్టిగా వాదించి, నాటు, మంత్ర వైద్యాల బారిన పడకుండ సదరు రోగిని రక్షించగలరు.

ఇక్కడికి దగ్గరలోని లంకపల్లి గ్రామంలో ఒక కుర్రాడికి పాము కరిస్తే, యధావిధిగా, ఇరుగు పొరుగు అనుభవజ్ఞులంతా ఐకమత్యంతో నాటు వైద్యుని దగ్గరకు తీసుకెళ్తుండగా, ఒకే ఒక్క వ్యక్తి అది తప్పని గట్టిగా వాదించి, చల్లపల్లిలోని ఎం.బి.బి.ఎస్. డాక్టర్ దగ్గరకే వెళ్ళాలని ఒప్పించి, ఎక్కువ సమయం వృథా కాకుండానే మా ఆసుపత్రికి తరలించాడు. నా దగ్గరకు వచ్చిన పావుగంటకే వాంతులై పరిస్థితి విషమించింది. 10 ఏ.ఎస్.వి. డోసులిస్తేగాని కోలుకోలేదు.

మరి యీ కుర్రాడి ప్రాణాలు కాపాడింది డాక్టరా? సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకొని రోగిని ఆస్పత్రికి తరలించిన వ్యక్తా? నిస్సందేహంగా యీ ఘనత సదరు గ్రామస్తునికే దక్కుతుంది. ఎందుకంటే - ఇక్కడ డాక్టర్‌ది



వృత్తి ధర్మం. గ్రామస్తునిది అయాచిత మానవతా సాయం! ఎంత ఎక్కువ మందికి ఈ కనీస అవగాహన ఉండి, సామాజిక బాధ్యతా యుతంగా మెలిగితే, ఎందరు తగిన సమయంలో గట్టిగా వాదించి, ఒప్పించగలిగితే - అన్ని నిండు ప్రాణాల్ని డాక్టర్లు రక్షించగలరు. **జనాన్ని విస్తృతంగా చైతన్యవంతుల్ని చేయందే పాము కాటు మరణాల నరికట్టడం సాధ్యపడదని జనవిజ్ఞానవేదిక తొలి నుంచీ వాదిస్తూనే ఉన్నది.**

**పాముకాటు - ప్రథమ చికిత్స :**

పాము కరచిన వెంటనే ముందుగా చేయవలసిన పని అది ఏ పామో గుర్తించడం. ఐతే ఈ ప్రయత్నంలో ఎక్కువ సమయం వృథా చేయకూడదు. వెంటాడి, వేటాడి, చంపి, ఆ పామును ఆస్పత్రికి తీసుకు పోనవసరం లేనేలేదు. కరిచిన విషసర్పాన్ని ప్రత్యక్షంగా డాక్టర్‌కు చూపినా, ఉన్న పళాన ఏ.ఎస్.వి. ఇంజక్షన్ చేయడు. విష లక్షణాలు రోగిలో గమనించినప్పుడు మాత్రమే వైద్యం చేస్తారు. మరైతే - కరిచిన పాము యొక్క కులగోత్రాలు గుర్తించడం ఎందుకంటారా? అది విష సర్పం కాదని తేలితే రోగి కంగారు పడకుండ స్తిమితంగా ఉండొచ్చనే!

* పాము కరిచిన వ్యక్తి హఠాత్తుగా భయాందోళనలు చెందుతుంటాడు. చనిపోతున్నానని తనకుతానే తీర్మానించుకొని, అయిన వాళ్ళకు అప్పగింతలు పెట్టుతుంటే - ఇరుగు పొరుగు వాళ్ళూ అతనితో బాటు ఆరున్నొక్క శృతిలో రాగాలాపన చేయకూడదు. **రోగికి ధైర్యం చెప్పాలి. "పాము విషానికి విరుగుడు ఇంజెక్షన్లున్నాయనీ, డాక్టర్ దగ్గరకు వెళ్తే ప్రమాదం నుండి బైట పడతావనీ" ధీమా కల్గించాలి. వైద్యంతో బ్రతికి, నిక్షేపంలా ఉన్న వాళ్ళను పదేపదే గుర్తుచేయాలి.**

* పాము కరిచిన శరీర భాగానికి కొంతపై భాగంలో తుండుతోనో, చేతి రుమాలుతోనో సుమారుగా బిగించి కట్టాలి. తాడుతోనో, ప్లాస్టిక్ వైరుతోనో మరీ గట్టిగా లాగి బిగించి కట్టకూడదు. అలా చేయడం వల్ల రక్త ప్రసరణ పూర్తిగా ఆగిపోయి, సదరు శరీరభాగం ఆస్పత్రికి వెళ్ళే సరికే కుళ్ళిపోవచ్చు. కట్టులోంచి ఒకవేలు దూరేంతగా బిగించి కడితే చాలు. తలపై కరిస్తే మాత్రం కట్టనవసరంలేదు.



* కరిచిన చోట ప్రత్యేకించి చేయవలసిందేమీ లేదు. గాట్లను పరిశీలించి, గుర్తించగల్గితే చాలు. రెండు లేక మూడు గాట్లుంటే విష సర్పమనీ, అంతకు మించి గాట్లుంటే అది సాధారణ సర్పమనీ గ్రహించవచ్చు.
* పాము కరిచిన గాట్ల దగ్గర నోరుంచి, విషంతో సహా రక్తాన్ని పీల్చి ఉమ్మేయటం సినిమాల్లో చూపిస్తుంటారు. ఐతే అది మంచిపని కాదు. ఒకటి - అలా విషపూరిత రక్తాన్నంతా పీల్చేయటం సాధ్యపడదు. రెండు - పీల్చేవారి నోట్లో ఎంత చిన్న పుండున్నా అతనికీ ప్రమాదమే.
* రాగయుక్తంగా, అభినయపూర్వకంగా దేవుణ్ణి ప్రార్థిస్తూ ఉంటే కరిచిన పామే చచ్చినట్లు మళ్ళీ వెనక్కి వచ్చి, తన విషాన్ని మాత్రమే గాయం నుండి పీల్చేసుకొని వెళ్ళిపోవటాన్ని గూడా కొన్ని సినిమాల్లో చూపిస్తుంటారు. ఐతే, యిదే నిజమని నమ్మి పాము కరిచినపుడు శ్రావ్యంగా భక్తిగీతాలు పాడుతుండే వాళ్ళను మాత్రం నిజజీవితంలో నేను చూడలేదు.
* పాము గాట్ల దగ్గర కొంత కండను కోసి తీసేస్తారు కొందరు. అలా చేస్తే చిన్నగాటు పెద్దగాయమై, దానికి మళ్ళీ అదనపు వైద్యం చేయవలసి వచ్చి, కోతి పుండు బ్రహ్మరాక్షసి కావడం తప్ప ఏ ఉపయోగమూ లేదు.

* రోగిని నడిపించకూడదు. సైకిలు, స్కూటరు, కారు - దేనిమీదైనా ఎక్కించుకొని, సాధ్యమైనంత తొందరగా దగ్గరలో ఉన్న ఎం.బి.బిఎస్. డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళాలి.
* పాము కరచిన రోగికి నోటి ద్వారా ఎలాంటి ఆహారమూ ఇవ్వొద్దు.




## డాక్టర్ చేసే వైద్యం

* కొన్ని ఇతర వైద్యాలతో పోల్చినప్పుడు ఇది సంక్లిష్ట వైద్యమేం కాదు.
* రోగికి ధైర్యం నూరిపోస్తూ, ఆస్పత్రిలో ఎడ్మిట్ చేసుకోవాలి.
* ఆహారమేమీ ఇవ్వకుండా సెలైన్ ఎక్కించాలి.
* ధనుర్వాతం రాకుండా ముందు జాగ్రత్తగా టెట్వాక్ యింజక్షన్ చేయాలి.
* రోగిని పరిశీలిస్తూ విషప్రభావం కనిపించినపుడు ఏ.ఎస్.వి. ఇంజక్షన్లు చేయాలి.
* విష లక్షణాలేవీ కనిపించకపోతే 24 గంటల తర్వాత రోగిని ఆస్పత్రి నుంచి పంపించివేయవచ్చు.
* పాము కరిచిన చేతికో, కాలికో ఒక్కోసారి చీము పట్టవచ్చు. అప్పుడు అవసరమనుకొంటే డాక్టర్ అక్కడ ఒక కోత పెట్టి చీము తొలగిస్తాడు.

* ఎప్పుడైనా రక్తపింజర విషం వల్ల మూత్రపిండాలు చెడితేనో, మెదడులో రక్త స్రావమై కోమాలోనికి వెళితేనో - నెఫ్రాలజిస్టు వద్దకో, న్యూరాలజిస్టు వద్దకో పంపుతాడు. ఐతే నూటికి ఒకటి రెండు సందర్భాలలో మాత్రమే ఇలాంటి అవసరాలు వస్తాయి.

## నివారణలు

వ్యవసాయ ప్రధానమైన మన దేశ గ్రామీణ ప్రాంతంలో పాము కాటును పూర్తిగా నివారించటం అసాధ్యం. వ్యవసాయ భూముల దగ్గర పాము లుంటాయి. పగలు చెట్టుచేమల దగ్గర ఏమరుపాటుగా ఉన్నా, రాత్రి పూట లైటు లేకుండ నడిచినా, నేలపై పడుకొని నిద్రించినా పాము కాటుల కవకాశాలుండనే ఉంటాయి. వ్యవసాయ కూలీలు చెరుకు తోటల్లో పనిచేసే సమయంలో చేతులకు తొడుగులు, మోకాళ్ళ వరకు బూట్లూ వేసుకోవడం మంచిది.

## రోగి బంధువుల విచిత్రాలు

సంప్రదాయం - అది మంచిదో, చెడ్డదో - దాని బలం ఎలా ఉంటుంద నేందుకొక ఉదాహరణ చిత్తగించండి.

రెండేళ్ళ క్రిందట ఒక మిట్ట మధ్యాహ్నం మంచి ఒడ్డూ పొడుగూ ఉన్న ఆసామి తన బంధువును త్రాచుపాము కరిచిందని తీసుకువచ్చాడు. నాటు వైద్యుని దగ్గరకు కాక కరచిన అరగంటలోపే సరాసరి ఆసుపత్రికే తీసుకు వచ్చినందుకు నేను సంతోషించాను. ఐతే విచిత్రంగా ఆసుపత్రి దగ్గర అతడు తన బంధువుల ఒత్తిళ్ళకు లొంగి మనసు మార్చుకొని, సూటిగా నిర్మొహమాటంగా నన్నిలా అడిగాడు- "డాక్టర్ గారూ. మా నమ్మకం మాది. ప్రక్క ఊళ్ళో నాటు వైద్యం చేయించి, మరొక్క గంటలో రోగిని మళ్ళీ మీ దగ్గరకు తీసుకొస్తాం. అప్పుడు మీరు వైద్యం చేద్దురుగాని..." నేను గూడ ఇంచుమించు ఆయనంత స్థిరంగానే చెప్పాను. "మీకా నాటువైద్యం కావాలనుకుంటే అలాగే వెళ్ళండి. కానీ అది ఎంతో రిస్క్ తీసుకోవడం. ఏ వైద్యం కావాలో త్వరగా నిర్ణయించుకోండి" అని. కొంతసేపు వాళ్ళలో వాళ్ళే తర్జన భర్జనలు పడ్డారు. నాటు వైద్యం కాదనుకొని, చివరకు మా ఆసుపత్రి వైద్యాన్నే ఎన్నుకున్నారు. ఐతే బలిష్టుడైన ఆ ఆసామి మాత్రం "నీ వైద్యంతో తగ్గక మావాడికేదైనా జరిగితే


నీ సంగతి తేలుస్తా...." అన్నట్లుగా నాకేసి చూసిన చూపు యిప్పటికీ నాకు మరపురాదు! సరే, ఆ రోగి పూర్తి స్వస్థుడై తిరిగి వెళ్ళడంతో అక్కడికి కథ సుఖాంతమైంది.

**సంప్రదాయ, ఆధునిక ఇంగ్లీషు వైద్యాలలో ఏదో ఒకటి ఎన్నుకోక తప్పని సన్నివేశంలో సగటు ప్రజల డోలాయమాన మానసిక స్థితికిదొక మంచి ఉదాహరణ!**

నేను వైద్యం చేసిన పాము కాటు కేసుల్లో అధిక భాగం నాటు, పసరు, మంత్ర వైద్యాల తర్వాత వచ్చినవే! ఆసుపత్రిలో రోగిని చేర్చాక, నాటు వైద్యం వంకకు మొగ్గినవారు కొందరున్నారు. మరికొందరైతే మా ఆసుపత్రికే నాటు వైద్యులను తీసుకునివచ్చి, ఏక కాలంలో రెండు వైద్యాలను పొందాలని ప్రయత్నించారు.

ఇందులో ఉన్న ఇబ్బందులు రెండు. నాటు, మంత్ర వైద్యాలతో కాలహరణం మొదటిది. కలికం కళ్ళల్లో పోయటంతో అవి ఎర్రబారి పాము విష ప్రభావం ఎంతో నాటు వైద్యమహిమెంతో తెలియని గందరగోళ పరిస్థితిలోకి వైద్యుణ్ణి నెట్టడం రెండోది. నోట్లో పసరు పోయటం వల్ల వాంతులు అయినవో, విషప్రభావంతో అయినవో తెలుసుకోవడం కష్టం. ఈ రెండు సందర్భాలలోను రోగికి ప్రమాద ఘంటికలు మ్రోగుతూనే ఉంటాయి.

నాటు వైద్యం చేయించి ఆసుపత్రికి తీసుకువస్తే ఆధునిక వైద్యం చేశానుకాని ఆసుపత్రిలో చేర్పించిన తరువాత నాటు వైద్యాన్ని ఇంతవరకూ అనుమతించలేదు.




## చివరగా


మార్పు అనేది యీ లోకం యొక్క సహజ లక్షణం. గత 20 ఏళ్ళగా చల్లపల్లి పరిసర మండలాలలో పాముకాటు వైద్యంలో స్పష్టమైన మార్పు వచ్చింది. సంప్రదాయ వైద్యాలైన మంత్రాల, ఆకుపసరుల వైద్యం నుండి

శాస్త్రీయ ఆధునిక వైద్యం వైపు జనం ఇంతగా మారుతున్నారంటే ఇందుకు ముఖ్య కారణం జన విజ్ఞాన వేదిక, రోటరీ, కె.సి.పి. సంస్థల కృషేనని చెప్పాలి.

ఈ చిన్న పుస్తకాన్ని చదివిన విజ్ఞులు అందలి ప్రధాన విషయాన్ని, పది మందితో చర్చించి, ప్రజల అవగాహన పెంచాలని మనవి. జనం మధ్య అలాంటి అవగాహన పెరిగి, పాము కాటు మరణాలు క్రమేపీ తగ్గితే అదే యీ పుస్తకానికి సార్థక్యం!

ఇండియాలోని ప్రముఖ హెర్పిటాలజిస్ట్ (పాము శాస్త్రజ్ఞుడు) రోములస్ విటేకర్ అభిప్రాయమిది....

**"అసలే వైద్యమూ లేకున్నా సగం మంది పాముకాటు రోగులు బ్రతుకుతారు. కొన్ని చిన్న జబ్బులకు మీరే వైద్యాలైనా చేయండి; పాము కాటుకు మాత్రం మంత్రతంత్రాల, పసరు వైద్యం చేసి, ఒక్క రోగి చనిపోయినా ఆ నాటు వైద్యుణ్ణి హంతకుడుగానే భావించాలి".**



## డా॥ వి. కళైఅరసన్ ( డైరెక్టర్, చెన్నై స్నేక్ పార్క్)తో 2005 లో చేసిన ఇంటర్వ్యూ

**నా ప్రశ్న: డాక్టర్ అరసన్! విష సర్పాల నుండి తీసే విషం వల్ల ప్రయోజనాలేమిటి?**

జవాబు : ఇందులో 99% విషం యాంటీ స్నేక్ వీనమ్ తయారీలో ఉపయోగ పడుతున్నది. మిగిలిన ఒక్కశాతం పరిశోధనల కోసం వాడుతున్నారు. ''బోట్రపేస్'' అనే మందు తయారు చేయటానికి పాము విషాన్ని ఉపయోగించేవారు. ఇదివరలో రక్తస్రావాన్ని అరికట్టటానికి 'Botrapase' ను వైద్యులు వాడేవారు.

**ప్రశ్న : మన దేశంలో సంవత్సరానికెన్ని ASV లు తయారవుతున్నాయి? ఎన్ని ఎక్కడ ఖర్చవుతున్నాయి?**

జవాబు : ప్రస్తుతం ఇండియాలో ఏటా సుమారు పది లక్షల యాంటీ స్నేక్ వీనమ్ వైల్స్ తయారవుతున్నాయి. ఇందులో లక్షన్నర ఇంజక్షన్లు తమిళనాడు ప్రభుత్వం, లక్షన్నర ఇంజక్షన్లు మహారాష్ట్ర ప్రభుత్వం, యాభైవేలు కేరళ ప్రభుత్వం కొనుగోలు చేస్తుండగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుమారు యాభైవేలు మాత్రం కొనుగోలు చేస్తున్నది.

**ప్రశ్న : 'హెర్పిటాలజీ' అంటే ఏమిటి?**

జవాబు : సరీసృపాల, ఉభయచరాల అధ్యయనం.

**ప్రశ్న : 'ఓఫియాలజీ' అంటే?**

జవాబు : సర్పాల అధ్యయనాన్ని 'ఓఫియాలజీ' అంటారు.

డాక్టర్ పాట్రిక్ రస్సెల్‌ను 'ఓఫియాలజీ పితామహుడు' (Father of Ophiology) గా వర్ణిస్తారు.

1727లో ఇంగ్లాండ్‌లో జన్మించిన పాట్రిక్ రస్సెల్ కొంతకాలం విశాఖపట్నంలో పనిచేశారు. వైద్యశాస్త్రంలో పట్టాపొంది, పాముల మీద విస్తృతంగా పరిశోధనలు చేశారు. విశాఖ ప్రాంతాలలో ఎక్కువగా వుండే ''కాటుక రేకుల పొడ పాము'' (రక్త పెంజెర) మీద పరిశోధనలు చేశారు. అందుకే ఆయన మరణానంతరం ఆపాముకు 'రస్సెల్స్ వైపర్' అని ఆయన పేరే పెట్టారు. తన 78వ ఏట 1805లో ఆయన మరణించారు.

ప్రశ్న : **సముద్రపు పాముల సమాచారం వివరిస్తారా?**

జవాబు : భారతదేశంలో ఉన్న 20 జాతుల సముద్ర సర్పాలన్నీ విషపూరితాలే. అయితే మన దేశంలో ఈ పాము కాట్లు చాలా అరుదు. ఆస్ట్రేలియా, జపాన్ వంటి దేశాలలో Sea Sports ఎక్కువ. సముద్ర పాము కాటులు కూడా ఆ దేశాలలో ఎక్కువే. ఇండియాలో సముద్ర సర్పాల విషాలకు విరుగుడు (యాంటీ స్నేక్ వీనమ్) తయారీ లేదుగానీ జపాన్, ఆస్ట్రేలియా మార్కెట్లలో దొరుకుతుంది.

ప్రశ్న : **ప్రపంచంలో అత్యంత ప్రమాదకరమైన పాము ఏది?**

జవాబు : అతి ప్రమాదకర విషసర్పం Tipan. దీన్నే టైగర్ స్నేక్ అని కూడా అంటారు. ఆస్ట్రేలియాలో ఉంటుంది. దీని తర్వాత ప్రమాదకరమైనది మన దేశంలోని కట్లపాము.

ప్రశ్న : **త్రాచుపాము పగ పడ్తుందనే ప్రజల నమ్మకం మీద మీ అభిప్రాయం?**

జవాబు : పగబట్టేందుకు అవసరమయ్యే జ్ఞాపకశక్తి, మెదడు పాములకు లేనే లేదు.

ప్రశ్న : **అంటే.. మామూలు త్రాచుకాశక్తి లేదు కానీ, కింగ్ కోబ్రాకు పగబట్టే శక్తి ఉందని కొందరి ఊహ...**

జవాబు : ఈ ప్రపంచంలో ఏ జాతి పాముకైనా పగబట్టేంత మేధాశక్తి లేదుగాక లేదు.

ప్రశ్న : **కింగ్ కోబ్రా కరిస్తే ఏం చేయాలి?**

జవాబు : అది చాలా పెద్దసైజు పాము కనుక కరిచినపుడు ఎక్కువ విషాన్ని శరీరంలోకి ఎక్కించగలదు. కింగ్‌కోబ్రా విషంలోని రసాయన నిర్మాణం కూడా త్రాచుపాము విషంలాగానే ఉంటుంది. కాకపోతే త్రాచు విషంకన్నా కాస్త పలచగా ఉంటుంది(Diluted poision). కింగ్‌కోబ్రా విషానికి కూడా మార్కెట్లో దొరికే యాంటీ స్నేక్ వీనమ్ విరుగుడుగా పని చేస్తుంది.

ప్రశ్న : **మీ 'చెన్నై స్నేక్ పార్క్' ఆశయాలేమిటి?**

జవాబు : ఇదొక 'సర్ప విద్యాసంస్థ'. ప్రకృతిలోని 'ఆహారపు గొలుసు'లో పాములు అనివార్య జీవులు. పర్యావరణ సమతుల్యత కోసం పాముల మనుగడ తప్పదనీ, చీటికీ మాటికీ పాముల్ని చంపవద్దనీ మేము ప్రజలకు వివరిస్తాం.

**థ్యాంక్స్ అరసన్ గారూ!**

**నమస్తే డాక్టర్!**



రక్త పింజరు కరిచిన తరువాత
చిగుళ్ళ నుండి వచ్చిన రక్తస్రావం



రక్త పింజరు కరిచిన తరువాత
మూత్రపిండం నుండి వచ్చిన రక్తస్రావం



కట్లపాము కరిచిన తరువాత
కళ్ళు మూతలు పడుతున్న
పరిస్థితి



కట్టు ఇలా కట్టకూడదు

* ప్రకృతిలోని ఆహారపు గొలుసులో పాము పాత్ర తప్పనిసరి. పర్యావరణ రక్షణకోసం పాముల్ని బ్రతకనీయండి.

*-కళై అరసన్, డైరెక్టర్, చెన్నై స్నేక్ పార్క్*

* కొన్ని స్వల్ప అస్వస్థతలకు మీరేవైద్యాలనైనా చేసుకోండి కాని, పాముకాటుకు నాటు, మంత్రవైద్యంతో ఒక్కరోగి మరణించినా, సదరు నాటు వైద్యుడిని హంతకుడుగానే భావించాలి...

*- రొమొలస్ విటేకర్, ప్రముఖ హెర్పిటాలజిస్ట్*

* పాము పగ పట్టడం ఒక బ్రహ్మాండమైన కల్పన!
పగబట్టి, వెంటాడి చంపటానికవసరమయే మెదడు పాములకు లేనే లేదు.

* పాముల్ని ద్వేషించి చంపవద్దు  పూజించి మ్రొక్కవద్దు. ఈ ప్రకృతిలో అవీ మనవంటి ప్రాణులే.

* కృష్ణాజిల్లాలో పేపర్లో పడిన పాముకాటు మరణాలు ఒక సంవత్సరంలో 55 దాక లెక్కించాం. పేపర్ కందని దురదృష్ట మరణాలెన్నో మరి! వీరిలో కనీసం 52 మందిని పల్లెప్రాంతాల ఎం.బి.బి.ఎస్. డాక్టర్లు బ్రతికించగలరనేది అనుభవపూర్వకమైన అంచనా.

* విష సర్పాల కాటులలో సుమారు 30 శాతం విషం ఎక్కని, ఉత్తుత్తి కాటులే ఉంటాయి. అనేక కారణాల వల్ల విషసర్పాలు కరిచిన ప్రతిసారీ తగిన మోతాదులో విషం ఎక్కక పోవచ్చు. వీటినే డ్రైబైట్స్ అంటారు. ఈ ఉత్తుత్తి కాటులే నాటు వైద్యులకు, మంత్రగాళ్ళకు గుర్తింపును, కీర్తిని తెచ్చిపెట్టేవి!

* సరైన మోతాదులో పాము విషం శరీరంలోకి ఎక్కితే ఏ.ఎస్.వి.తో తప్ప ఈ ప్రపంచంలో మరే వైద్యం వల్లనైనా ఎవరైనా బ్రతికిన దాఖలా యింతవరకూ లేదు.

* నాగుపాము తలపై నుండే 'నాగమణి' చుట్టూ ఎన్నెన్ని సినిమాలు, సీరియళ్ళు, నవలలు వచ్చాయో! అసలు నాగమణే ఒక అభూతకల్పన.

* అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కనీసం పది డోసుల 'ఏంటీ స్నేక్ వీనమ్' చొప్పున నిల్వ వుంచేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి.